సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 25 | జనవరి | 2025



భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు
మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరలో భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

-10లో▸



బాబోయ్ శునకాలు..
-11లో▸

గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారు.



వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ స్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉన్నప్పటికీ, రాత్రి పొగమంచు ఎక్కువగా కురియడంతో చలి ఉంటుంది.

పర్యాటక ఓరుగల్లు
ఆధ్యాత్మిక.. ఆహ్లాద విహారం..

నేడు పర్యాటక దినోత్సవం



ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాస్త విరామం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఏదైనా యాత్రకు వెళ్లాలంటే నాలుగైదు రోజుల సమయం కావాలి. ఖర్చు అధికంగానే ఉంటుంది. పిల్లలకు సెలవులు ఉండాలి. ఇవన్నీ సంవత్సరానికి ఒకసారే వీలవుతాయి. ఒకటి రెండు రోజులు సెలవులు దొరికినా చూసేందుకు ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు మన దగ్గరే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయిస్తంభాలు, శ్రీభద్రకాళి దేవాలయాలు, మేడారం, రామప్ప, మంగపేట హేమాచలక్షేత్రం, ఆహ్లాదప్రాంతాలైన ఖిలావరంగల్ కోట, జూపార్క్, లక్నవరం, బొగత, బ్లాక్‌బెర్రీ తదితర ప్రాంతాలున్నాయి. నేడు(శనివారం) జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను ఒకసారి చూసేద్దాం..

- పూర్తి వివరాలు 10లో▸





న్యూస్‌రీల్

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి
● అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి సూచించారు. మంజూర్‌నగర్‌లోని మెడికల్ కళాశాల, హాస్టల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్య విద్యార్థులు చదువుపై దృష్టిసారించి లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో ఉంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలరని చెప్పారు.

కాళేశ్వరాలయంలో రాష్ట్ర యూత్ సర్వీసెస్ డైరెక్టర్



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని రాష్ట్ర యూత్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు(ఐఏఎస్) దర్శించుకున్నారు. శుక్రవారం ఆయన ఆలయానికి రాగా ఆలయఅధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆశీర్వచన వేదిక వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ ఆయనను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదం అందజేశారు. అనంతరం హరిత హోటల్‌ను పరిశీలించారు. ఆయనతో హోటల్ మేనేజర్ జక్కం సురేశ్ ఉన్నారు.

ఓటరు అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలి
భూపాలపల్లి అర్బన్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(శనివారం) జిల్లా కేంద్రంలోని నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ అంబేడ్కర్ స్టేడియం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ఓటరు ఈ అవగాహన ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. భూపాలపల్లి ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు పట్టణ ప్రజలు, విద్యార్థులు ర్యాలీ లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేవాదాయ శాఖ ఆధీనంలో వేంకటేశ్వరాలయం



భూపాలపల్లి అర్బన్: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు జిల్లా కేంద్రంలో జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం దేవాదాయ శాఖ అధికారులు ట్రస్ట్ నుంచి ఆధీనంలోకి తీసుకున్నారు. నెల రోజులుగా దేవాదాయశాఖ అధికారులు ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ వెంకటరమణరెడ్డి, ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఎట్టకేలకు శనివారం పోలీస్ పహారా నడుమ దేవాదాయ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ సునీత ఆలయంలోని హుండీలను సీజ్ చేశారు. ఆలయంలో ఉన్న వస్తువులు, దేవుడి కిరీటాలు, ఉత్సవ విగ్రహాలు, వెండి, బంగారు ఆభరణాలను దేవాదాయ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంటూ కమిషనర్ నోటీస్ అంటించారు.

దరఖాస్తుల స్వీకరణ
భూపాలపల్లి రూరల్: పేద, నిరుద్యోగ, క్రిస్టియన్ మైనార్టీ మహిళలనుంచి కుట్టు మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం కింద ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణా సంస్థల ద్వారా టైలరింగ్ కోర్సులు చేసిన వారికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని ప్రకటించినట్లు తెలిపారు. అర్హతగల వారు ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. క్రిష్టియన్ మైనార్టీ కమ్యూనిటీకి చెందిన నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, విడాకులు తీసుకున్న మహిళలు, వితంతువులు, అనాథలు, ఒంటరి మహిళలు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మిరప రైతు కుదేలు
తెగుళ్లతో తగ్గిన దిగుబడి

- పడిపోయిన ధరలతో మరిన్ని కష్టాలు
- గతేడాది క్వింటా రూ.18 వేలపైనే..
- ఈ ఏడాది రూ.8వేల నుంచి రూ.12 వేల లోపే..

భూపాలపల్లి రూరల్: ఈ ఏడాది మిర్చిపంటను వెంటాడిన తెగుళ్లతో.. మార్కెట్లో పడిపోయిన ధరలతో మిరప రైతులు కుదేలయ్యారు. గతేడాది మిర్చికి కాస్తో కూస్తో ధర ఉండేది. ఈ ఏడాది ఆ ధర కూడా లేకపోవడంతో రైతులను నిరాశలోకి నెట్టింది. మిరపకు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తీరని నష్టం వాటిల్లింది. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. దిగుబడి సగానికి తగ్గింది. మద్దతు ధర లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది క్వింటా మిర్చి రూ.18 వేల పైగా ఉంటే ఈ ఏడాది రూ.12 వేలకు పడిపోయింది.

మిర్చి సాగుకు రైతులు ఎకరాకు రూ.1.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. వారానికి రెండుసార్లు పురుగు మందులు పిచికారీ చేసినా ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడే వచ్చే పరిస్థితి నెలకొంది.

తగ్గిన ధర..

2022–23లో క్వింటాకు రూ.35వేలకు పైగా.. 2023–24లో రూ.18వేలు ఈ సారి క్వింటా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే ధర ఉంది. ప్రతీఏడాది ఇలా ధరలు తగ్గుతోండడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. వాతావారణ పరిస్థితుల కారణంగా దిగుబడులు లేక రైతులు ఉసూరుమంటున్నారు. మూడేళ్లుగా మిర్చి విత్తనానికి ప్రభుత్వం నుంచి రాయితీ లభించకపోవడం మార్కెట్లో మిర్చి ధరలు స్థిరంగా లేకపోవడం వల్ల రైతులు అయోమయంలో పడ్డారు.



కొంపెల్లిలో తెగుళ్లు సోకిన మిర్చి



మండలం	ఎకరాలు
భూపాలపల్లి	2,542
చిట్యాల	2,325
రేగొండ	3,652
మొగుళ్లపల్లి	1,504
కాటారం	443
టేకుమట్ల	1,103
కొత్తపల్లి గోరి	834
మహదేవపూర్	3,590
మహాముత్తారం	152
మల్హర్	1,516
పలిమెల	775
మొత్తం	19,637 ఎకరాలు

మండలాల వారీగా మిర్చి సాగు (ఎకరాల్లో)

ఇతని పేరు గుండెబోయిన రాజైలు, భూపాలపల్లి మండలంలోని గుడాడ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు. ఇతను రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. ఈ ఏడాది పంటకు తెగుళ్లు సోకడంతో 15సార్లు పురుగుల మందులకు అప్పులు తెచ్చి రూ.2.20 లక్షలకు పెట్టుబడి పెట్టాడు. మూడు సంవత్సరాలక్రితం ఎకరాకు 20 క్వింటాళ్లు వచ్చిన పంట ఈ ఏడాది 5 క్వింటాళ్ల వరకు రావొచ్చని, అందులో వాతావరణ పరిస్థితులకు సగం మిర్చి తెల్లబడిందని వాపోయాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్‌లో ఉన్న ధరకు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నాడు.





గొర్లవీడులో

రంగు మారిన పంట
తెగుళ్ల కారణంగా రంగు మారిన మిర్చి పంటను మార్కెట్లో కొనుగోలు చేయడం లేదు. ఒక వేళ కొనుగోలు చేసినా తక్కువగా క్వింటా రూ.5 వేలకు అడుగుతున్నారు. నాణ్యమైన పంట ఎంత వచ్చిందో రంగు మారిన మిర్చి కూడా అంతే దిగుబడి రావడంతో రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో చేసేది లేక మార్కెట్లో వచ్చిన ధరకే పంటలను విక్రయించి నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్ల బెడదతోనే..



రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాను. కొన్ని రోజులకే రకరకాల తెగుళ్లు సోకాయి. మొదటిసారి కాపు తీయగా 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రంగు మారింది. రెండు ఎకరాలకు కలిపి రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. మిరప పంటను వదిలేసే పరిస్థితి వచ్చింది. ఇంత దారుణమైన పరిస్థితి ఎప్పుడు చూడలేదు.

– కందునూరి వెంకటస్వామి, రైతు, జంగేడు

నివారణ చర్యలు చేపడుతాం..
జిల్లాలో మిర్చికి సోకిన తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే శాస్త్రవేత్తలను పిలిపించి నివారణ చర్యలు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి

కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల దీక్ష
● సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే సాంబశివరావు



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే సాంబశివరావు

గణపురం: మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 5 రోజూ కొనసాగాయి. తెలంగాణలోని 23,000 మంది ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని కార్మికులు తమ దీక్ష కొనసాగిస్తున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల చందన్ సింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి సంఘీభావం తెలిపారు.

స్టాండింగ్ ఆర్డర్‌తో అన్యాయం

భూపాలపల్లి రూరల్: విద్యుత్ సంస్థలో ఒకే సంస్థలో ఒకే రూల్స్ లేకపోవడం, స్టాండింగ్ ఆర్డర్‌తో ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ కన్వీనర్ మోత్కూరి కోటి అన్నారు. జేఏసీ అధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికులు 19,666 మంది ఉన్నారని.. ఐటీఐ చేసిన వారికి జేఎల్ఎమ్, డిగ్రీ చేసిన వారికి జూనియర్ అసిస్టెంట్, డిప్లమో చేసిన వారికి సబ్ ఇంజనీర్, టెన్త్ చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఇవ్వాలని కోరారు. మానస, ధనలక్ష్మి, సురేందర్ రెడ్డి, అంకుషావలి, చారి, రవీందర్, చందు, రాజేందర్, పైడయ్య, రామచందర్, రాజయ్య, తిరుపతి పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి
జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి



బాలికను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అధికారులు

భూపాలపల్లి అర్బన్: నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువొక్కటే సాధనమని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాం రెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేదరికం, బాల్య వివాహాలు అనేవి బాలికల అభివృద్ధికి అతిపెద్ద ఆటంకాలని వాటిని అధిగమించి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సమ్మయ్య, అధ్యాపకులు శిరీష, సుశీల, పెద్దన్న, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

బాలికలకు ప్రభుత్వం అండగా..

భూపాలపల్లి రూరల్: బాలికలకు ప్రభుత్వాలు అండగా, రక్షణగా ఉండేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. బేటి బచావో బేటి పడావో దశాబ్ది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భాగంగా జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలిక కడుపులో ఉన్నప్పటి నుంచే ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని వివరించారు. మిషన్ వాత్సల్యపథకం ద్వారా జిల్లాలో నెలకి రూ.4,000 రూపాయల చొప్పున 70 మందికి అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించినవారికి రూ.5,000 బహుమతిగా ఇస్తానని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆడపిల్లలు మొబైల్ ఫోన్స్ వాడకుండా ఉండడం మేలని తెలిపారు. అనంతరం బాలికలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, సీడీపీఓ మల్లీశ్వరి, మహిళ సాధికారత సిబ్బంది అనూష, కృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ
అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కాటారం: అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందేవరకు నిరంతర దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. కాటారం మండలం ఇబ్రహీంపల్లి, చింతకాని, మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలను ఆయన పరిశీలించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులకు సంబంధించిన అర్హుల జాబితాను పరిశీలించి లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాలో లేవని గ్రామసభల్లో లబ్ధిదారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయాలనే ఉద్దేశంతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు చేరవేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల జాబితాల్లో పేర్లు లేని అర్హులు ఆందోళన చెందవద్దని దరఖాస్తు చేసుకుంటే పరిశీలించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక నిత్యం కొనసాగే ప్రక్రియ అన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, కాటారం, మహాముత్తారం తహసీల్దార్లు నాగరాజు, శ్రీనివాస్, ఎంపీడీఓలు బాబు, శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు అండగా ఉంటా..
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, పక్కన ఎమ్మెల్యే కూనంనేని, తదితరులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ కాలనీలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎర్ర చెరువులో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ కాలనీ ద్వితీయ వార్షికోత్సవ బహిరంగ సభకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావులతో కలిసి హాజరయ్యారు. కాలనీలో ఎమ్మెల్యే నిధులతో వేయించిన మంచినీటి బోరును ప్రారంభించారు. అనంతరం కాలనీ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావుతో కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడి పట్టాలు ఇచ్చేందుకు, సహకరిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భగత్ సింగ్ కాలనీ వాసులకు ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యతను కల్పిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో గుడిసె వాసులు ఇచ్చిన మాట ప్రకారం ఓటు వేసి గెలిపించినందుకు రుణపడి ఉంటాని గండ్ర సత్యనారాయణ రావు కృతజ్ఞతలు తెలిపారు. పాలకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

పేదల కోసం పుట్టిన పార్టీ.. సీపీఐ

పేదలకోసమే పుట్టిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధికార పార్టీలను పేదల పక్షాన ప్రశ్నించే పార్టీ సీపీఐ అన్నారు. పేదల పక్షాన ఉన్న పార్టీలకు సీపీఐ సహకారం ఉంటుందని తెలిపారు. కాలనీవాసులకు పట్టాలిప్పించే వరకు పార్టీ కృషి చేసుందన్నారు. సమావేశంలో నాయకులు సమ్మిరెడ్డి, శాంతి కుమార్, సాతుకు ప్రవీణ్ కుమార్, క్యాతగరాజు సతీష్, కొరిమి సుగుణ, సీపీఐ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, తోట రామచందర్, శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, పోషం పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ
- గ్రామసభల్లో కొత్తగా 40,711 దరఖాస్తులు
- రేషన్‌కార్డుల కోసమే అత్యధికం..

భూపాలపల్లి: కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళ మంజూరి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించిన గ్రామసభల్లో మొత్తం 40,711 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా రేషన్‌కార్డుల కోసం వచ్చినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. రైతు భరోసా కోసం 520, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా–7,344, రేషన్ కార్డుల–20,186, ఇందిరమ్మ ఇళ్ల–12,661 దరఖాస్తులు వచ్చాయి. భూపాలపల్లి మున్సిపాలిటీలో 4,590, రూరల్‌లో 3,272, చిట్యాల మండలంలో 3,289, గణపురం–3,503, కాటారం–6,028, గోరికొత్తపల్లి–1,016, మహదేవ్‌పూర్–5,150, మహముత్తారం–2,167, మల్హర్–3,655, మొగుళ్లపల్లి–4,465, పలిమెల–452, రేగొండ–2,274, టేకుమట్ల మండలంలో 850 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి
సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్



పంకెన గ్రామసభలో అర్హుల జాబితా పరిశీలిస్తున్న మయాంక్ సింగ్

పలిమెల : పేదలకు ప్రభుత్వ అందించే పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తెలిపారు. మండలంలోని పలిమెల, పంకెనలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను అయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ మాట్లాడుతూ.. అర్హుందరికీ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వర్తిస్తాయని తెలిపారు. జాబితాలో పేర్లు లేని వారు నిరుత్సాహపడకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిల్, ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గర్భగుడిలో వీడియో చిత్రీకరణపై ఫిర్యాదు
కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో సింగర్ మధుప్రియ పాట వీడియో చిత్రీకరణపై ఈఓ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్‌కు శుక్రవారం ఉత్తర తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ ఫిర్యాదు చేశారు. ఆలయ ప్రతిష్ట దెబ్బతీసేలా వీడియో చిత్రీకరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని కాకతీయ జూపార్కుకు ఇటీవల వచ్చిన జంతువులతో కొత్తకళ సంతరించుకుంది. ఇప్పుడున్న చిరుతలు, ఎలుగుబంటి, మొసళ్లు, నెమళ్లు, జింకలు, ఆస్ట్రిచ్, కొండెంగలు, నక్కలు, పక్షులతో పాటు కొత్తగా తీసుకొచ్చిన రెండు పెద్ద పులులు (శంకర్, కరీనా), అడవి దున్నలు, హగ్ డీర్, బార్‌కిన్ డీర్ (జింకలు) సందడి చేస్తున్నాయి. రాష్ట్రంలోనే హైదరాబాద్ జూపార్కు తర్వాత కాకతీయ జూపార్కు రెండో అతిపెద్దది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. మినీ జూపార్కుగా ఉన్న దీన్ని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో మీడియం జూపార్కుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్మార్ట్ సిటీ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

మూడేళ్లలో పార్కుకు వచ్చిన పర్యాటకులు, ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి.

సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	వచ్చిన ఆదాయం
2022 - 23	2,91,802	1,16,96,010
2023 - 24	2,48,187	1,14,96,685
2024 - 25 జనవరి	1,80,811	88,44,725

పర్యాటక ఓరుగల్లు

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాలు, సరస్సులు, జలపాతాలు ఉన్నాయి. వాటిని చూసేందుకు రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా ఉమ్మడి జిల్లా రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఈక్రమంలో సందర్శకుల నుంచి ఆదాయం సైతం వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి మరిన్ని సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తే పర్యాటకం పరుగులెత్తనుంది. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	ఆదాయం
2021 - 2022	68,645	రూ.20,20,500
2022 - 2023	57,281	రూ.22,92,160
2023 - 2024	61,873	రూ.24,73,665

పర్యాటకులను ఆకర్శిస్తున్న బొగత

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం పర్యాటకులను ఆకర్శిస్తోంది. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గుట్టల మధ్య దండకారణ్యంలో సుమారు 50 కిలో మీటర్ల దూరంలో నల్లందేవి గుట్ట వద్ద పుట్టి, అక్కడ నుంచి ప్రవహిస్తూ చీకుపల్లి గ్రామ సమీపంలో బండలపై నుంచి జాలువారుతూ పరవళ్లు తొక్కుతోంది. జూన్ 20 నుంచి నవంబర్ వరకు జలపాతం కనువిందు చేస్తుంది. బొగత భద్రాచలం నుంచి 123 కిలో మీటర్లు, ఖమ్మం నుంచి 243, వరంగల్ నుంచి 123 కిలో మీటర్లు ఉంటుంది.

కాకతీయుల కళానైపుణ్యానికి ప్రతీక వేయిస్తంభాల దేవాలయం

హన్మకొండ కల్చరల్: దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన వేయిస్తంభాల దేవాలయం వరంగల్‌కు 5 కిలోమీటర్ల దూరంలో హనుమకొండ నడిబొడ్డన ఉంది. చాళుక్యుల శైలిలో కాకతీయ వంశానికి చెందిన రుద్రదేవుడి పాలనలో నిర్మించారు. కాకతీయ సామ్రాజ్య కళాపిపాసకు, విశ్వబ్రాహ్మణ శిల్పుల పనితనానికి మచ్చుతునగా, భావితరాలకు వారసత్వంగా నిలుస్తోంది. కాకతీయుల శిల్పకళా శైలితో అలరారే ఈ త్రికుటాలయంలో నక్షత్రాకార పీఠంపై రుద్రేశ్వరుడు ప్రధాన అర్చమూర్తిగా లింగరూపంలో భక్తుల పాలిట కొంగు బంగారమై కొలువయ్యాడు. ప్రధానాలయం తూర్పునకు అభిముఖంగా అద్భుతమైన వాస్తుకళతో చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. ఆలయ మండపానికి ఉత్తరాభిముఖంలో నందీశ్వరుడి విగ్రహం నల్లరాతితో మలచబడి, కల్యాణ మండపానికి, ప్రధానాలయాలకు మధ్య దర్శనమిస్తోంది. మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి, గణేశ నవరాత్రుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది.

సంవత్సరం	ఆదాయం
2022 - 23	రూ.59,50,950
2023 - 24	రూ.64,81,550



అపురూప శిల్పకళా సంపద రామప్ప


వెంకటాపురం(ఎం): అపురూప శిల్పాకళా సంపదకు నిలయం.. ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం. వరంగల్ నుంచి సుమారు 65 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడి సైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రుడు 1213వ సంవత్సరంలో రామప్ప దేవాలయాన్ని నిర్మించాడు. దేవాలయంలో శివలింగాన్ని (రుద్రేశ్వరుడు, రామలింగేశ్వరస్వామి) ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఇసుకనే పునాదిగా వాడి ఆలయాన్ని నిర్మించగా, నీటిలో తేలాడే ఇటుకలతో ఆలయ గోపురాన్ని నిర్మించడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. గర్భగుడికి ఎదురుగా ఉన్న నందీశ్వరుడిలో జీవకళ ఉట్టిపడుతోంది.

సంవత్సరం	ఆదాయం
2021 - 22	రూ.27,56,770
2022 - 23	రూ.28,66,030
2023 - 24	రూ.35,54,532



ప్రకృతి ఒడిలో పాండవుల గుట్టలు

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రావులపల్లి శివారులోని పాండవుల గుట్టల చుట్టూ పచ్చని పొలాలు, ప్రకృతి అందాలు, జాలువారే జలపాతాలు, ప్రాచీన కాలం నాటి రాతి చిత్రాలు పర్యాటకుల ఆహ్లాదానికి చిరునామాగా మారాయి. పాండవుల గుట్టలు ఎక్కువగా సున్నపు రాళ్లతో, అవక్షేప శిలలతో ఏర్పడి ఒకదాని మీద మరొకటి పేర్చినట్లు కనువిందు చేస్తున్నాయి. ఎత్తైన బండరాళ్ల మధ్యలో, లోతైన లోయలు, నిల్చున్న కొండ ఆనవాళ్లు కనిపిస్తాయి.



కళా వైభవానికి దర్పణం కోటగుళ్లు

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పర్యాటం వైపు పరుగులెత్తుతోంది. గణపురం మండల కేంద్రంలో కాకతీయుల కళా వైభవానికి దర్పణం పట్టేలా నిర్మించిన కోటగుళ్ల (గణపేశ్వరాలయం)తో పాటు గణపసముద్రం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి. 1199 - 1260 మధ్య కాలంలో గణపురం సామంతుడైన గణపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని గణపురం ఈశాన్యంలో మట్టి కోటల మధ్య నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా 16వ శతాబ్దం ప్రారంభంలో కులీకుతుబ్ ఉల్‌ముల్క్ అనే మహ్మదీయ రాజు ఈ ఆలయాన్ని ఫిరంగ్‌లతో పేల్చి ధ్వంసంచేశాడు. 15 ఏళ్ల నుంచి నిత్య పూజలతో వెలుగులోకి వచ్చింది.



మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలో రెండేళ్లకోసారి సమ్మక్క - సారలమ్మ మహాజాతరను పూజారులు ఘనంగా నిర్వహిస్తారు. ఏడాది మధ్యలో మినీ మేడారం జాతర జరుగుతుంది. 1996లో మేడారం గిరిజన జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. అప్పటి నుంచి మేడారానికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. సమ్మక్క - సారలమ్మ పూజారులు సంప్రదాయంగా అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తారు. మేడారానికి వచ్చే భక్తుల్లో చాలామంది అడవుల్లో చెట్ల కింద వంటావార్పు చేసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తారు. మేడారంలోని జంపన్నవాగు, చిలకలగుట్ట, సమ్మక్క జలధార, కంక వృక్షాలు భక్తులకు ఆకట్టుకుంటాయి. ఏటేటా మేడారానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. అమ్మవార్ల దర్శనానికి వచ్చేవారు విందు, వినోదాలతో సందడి చేస్తారు. అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది.


















సంవత్సరం	ఆదాయం
2022 - 23	9,95,24,978
2023 - 24	11,32,16,239

పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న భద్రకాళి దేవాలయం

ఓరుగల్లులో కొలువైఉన్న భద్రకాళి ఆలయం అత్యంత ప్రాచీనమైంది. వరంగల్, హనుమకొండ మధ్యలో భద్రకాళి సరస్సు, దాని పక్కన ఎత్తైన కొండపై ఉన్న ఒక పురాతన దేవాలయం ఇది. క్రీస్తు శకం 625లో భద్రకాళి ఆలయం నిర్మించగా, దుర్గమమైన భద్రకాళి గుట్టల్లో ఏకాండ శిలలో వెలిసిన అమ్మవారు మాత్రం అంతకంటే పూర్వనుంచే ఉన్నారు. భద్రకాళి ఆలయాన్ని 1950లో పునరుద్ధరించారు. ఈ ఆలయాన్ని అత్యంత ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. ప్రతీ సంవత్సరం లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. కాకతీయ రాజులు భద్రకాళి దేవిని తమ పితృదేవతగా కొలిచేవారు. భద్రకాళి సరస్సును కాకతీయులే నిర్మించారు. అమ్మవారు తొమ్మిదడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పు, ఎనిమిది చేతులతో దర్శనమిస్తున్నారు. ప్రతిరోజు 100టోకెన్లు, శుక్రవారం, ఆదివారాల్లో 200టోకెన్లు భక్తులకు అందజేస్తారు.

సజీవ సాక్ష్యాలు కాకతీయ కట్టడాలు

ఖిలా వరంగల్: చారిత్రక కట్టడాలు.. ప్రకృతి సౌందర్యాలు.. ఆధ్యాత్మిక కేంద్రాల కలయికే ఓరుగల్లు నగరం. కాకతీయుల కళారాజ్యంలో నాటి అందమైన అద్భుత శిల్పకళా ఖండాలతో పాటు పచ్చని పల్లెటూరు వాతావరణం పర్యాటక శోభకు అద్దం పడుతోంది. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోట.. ప్రపంచ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. కాకతీయుల శకం ముగిసి 800 ఏళ్లు గడుస్తున్నా నేటికీ చారిత్రక కట్టడాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. కోటలో స్వయంభూ శంభులింగేశ్వర స్వామి, నాలుగు కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్, ఏకశిల గుట్టపై కట్టడాలు, శత్రుదుర్భేధ్యమైన మట్టికోట, రాతికోటలు ఉన్నాయి. సుమారు రోజూ రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం వస్తోంది. ఏడాదికి సుమారు రూ.7లక్షలకు పైగా ఆదాయం సమకూరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాకాల అందాలు అదరహో

సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	ఆదాయం
2022	40,634	రూ.12,21,210
2023	41,297	రూ.17,95,470
2024	41,453	రూ.17,96,860

ఖానాపురం: పర్యాటక ప్రాంతాల్లో పాకాలకు ప్రత్యేక స్థానం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాకాలకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, ఖమ్మం, ఇతర ప్రాంతాలను నుంచి పర్యాటకులు నిత్యం తరలివస్తుంటారు. కట్టపై నుంచి సరస్సు అందాలతో పాటు జలసవ్వడిని ఆస్వాదిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాకాల సరస్సు మీదుగా సూర్యచంద్రుల ప్రతిబింబాలు పర్యాటకులను కనువిందు చేస్తుంటాయి. గతంలో బోటింగ్ నిలిచిపోగా ప్రస్తుతం బోటింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నైట్‌క్యాంపింగ్, వాచ్‌టవర్ల ఏర్పాటుతో పర్యాటకులు సరస్సు, పాకాల అందాలను వీక్షిస్తూ అద్భుతమంటూ కితాబిస్తున్నారు.

టూరిస్ట్ పిక్నిక్ స్పాట్ లక్నవరం

సంవత్సరం	పర్యాటకులు
2022	5 లక్షలు
2023	7 లక్షలు
2024	9 లక్షలు

గోవింద రావుపేట: ములుగు జిల్లా గోవింద రావుపేట మండలంలోని బుస్సాపూర్ గ్రామ సమీపంలో లక్నవరం సరస్సు ఉంది. ఇది ప్రసిద్ధిగాంచిన టూరిస్ట్ పిక్నిక్ ప్రదేశం. మూడు ఇరుకైన లోయలను సిమెంట్ కట్టడాలతో మూసివేయడం వలన ఈ సరస్సు ఏర్పడింది. ఈ సరస్సును 13వ శతాబ్దంలో కాకతీయ రాజవంశం పాలకులు నిర్మించారు. ఈ ప్రాంతం మొత్తం పచ్చని పంటలు, ఆహ్లాదకరమైన నీటి వనరులతో కళకళలాడుతూ ఉంటుంది. అదనపు ఆకర్షణగా సస్పెన్షన్ వంతెనలు నిర్మించారు. లక్నవరం సరస్సుకు వెళ్లే దారిలోనే అటవీ ఉద్యానవనం జింకల పార్కు ఉంది. ట్రెక్కింగ్ ద్వారా అడవిని చూడొచ్చు.

అందాల బ్లాక్ బెర్రీ ఐలాండ్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఏటూరునాగారం వైపు వెళ్లే జాతీయ రహదారిని అనుకుని జలగలంచ అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్ ఉంది. చుట్టూ దట్టమైన అటవీప్రాంతం మధ్యలో ఎడారిలా బ్లాక్ బెర్రీ ఐలాండ్ కొలువైంది. ఇసుక మేటలతో ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఐలాండ్ చుట్టూ వాగు ప్రవహిస్తోంది. బ్లాక్‌బెర్రీ దీవి ఐలాండ్ పర్యాటకులకు ఆకర్శిస్తోంది. పర్యాటకులు రాత్రి వేళలో బస చేసేందుకు 50 గుడారాలు ఏర్పాటు చేశారు. అలాగే, రెస్టారెంట్ కూడా ఉంది. రాత్రిపూట చలిమంటలు, సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు. ఐలాండ్‌ను మొత్తం వీక్షించేందుకు వాచ్ టవర్ కూడా ఉంది. బ్లాక్ బెర్రీ ఐలాండ్ సందర్శన కోసం ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించారు.

రెండో యాదగిరి గుట్ట.. హేమాచల క్షేత్రం

మంగపేట: అడవితల్లి ఒడిలో నెలవై రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచిన హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం 5వ శతాబ్దంలో ఏర్పడినట్లు చరిత్ర చెబుతోంది. ప్రకృతి ప్రసాదంగా వెలిసిన ఈ దైవక్షేత్రంలో స్వయంభూ లక్ష్మీనర్సింహుడిని దర్శించుకునేందుకు సమీప రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అంతటి విశిష్టత కలిగిన ఈ ఆలయం వరంగల్‌కు సుమారు 134 కిలోమీటర్ల దూరంలో ములుగు జిల్లా మల్లూరు గుట్టపై ఉంది. ఆరున్నర అడుగుల ఎత్తుగల స్వామివారి విగ్రహాన్ని గుహలో నుంచి తొలుస్తున్న క్రమంలో స్వామివారి నాభిలో గడ్డపార గుచ్చుకోగా, నాభి నుంచి నేటికీ చీము వంటి ద్రవం ప్రవిస్తోందని అర్చకులు చెబుతున్నారు. ఆ ద్రవాన్ని మంచి చందనంతో కలిపి నాభి చందన ప్రసాదంగా భక్తులకు ఇస్తుంటారు. ఆలయ సమీపంలో ప్రకృతి సిద్ధంగా వెలిసిన కోనేరు, చింతామణి జలపాతం ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీరుస్తోంది.



జేఈఈ మెయిన్స్‌కు 61మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం హనుమకొండ, వరంగల్‌లోని 5 పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లలో 61మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 1,221 మంది అభ్యర్థులకు 1,186 మంది హాజరుకాగా, రెండో సెషన్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన పరీక్షకు 1,085మంది అభ్యర్థులకు 1,059మంది అభ్యర్థులు హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ శ్రీలతారెడ్డి వివరించారు.

డ్రైవర్ వృత్తి గొప్పది

● ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను

హన్మకొండ: డ్రైవర్ వృత్తి చాలా గొప్పదని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో డ్రైవర్స్ డేను జరుపుకున్నారు. డ్రైవర్లకు ఆర్టీసీ ఆర్‌ఎం. విజయ భాను, అధికారులు పూలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ డ్రైవరే అన్నారు. ఇందులో బేధాభిప్రాయాలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) ఎం.మాధవరావు, డిపో మేనేజర్‌లు వంగల మోహన్ రావు, బి.ధరమ్ సింగ్, సూపర్ వైజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



డిపోలో డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఆర్‌ఎం డి.విజయభాను

నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష

వరంగల్ లీగల్: వరంగల్ నగరంలోని శివసాయి మందిరం పూజారి సత్యనారాయణ శర్మ హత్యకేసులో నేరస్తుడు సయ్యద్ నాదిక్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2018, అక్టోబర్ 26 ఉదయం 5.30గంటలకు పోచమ్మ మైదాన్ సెంటర్‌లోని శివసాయి మందిరం పూజారి సత్యనారాయణ శర్మ హారతి కార్యక్రమాన్ని మైక్ ద్వారా వినిపిస్తుండగా సయ్యద్ నాదిక్ హుస్సేన్ అక్కడికి వచ్చి తమకు అసౌకర్యంగా ఉందని, మైక్ ఎందుకు పెట్టావని అకారణంగా పూజారిపై దాడిచేసి గాయపర్చాడు. తీవ్ర గాయాల పాలై రక్తపు మడుగులో ఉన్న సత్యనారాయణ శర్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నాలుగు రోజుల అనంతరం పూజారి మృతి చెందారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నాటి ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి పరిశోధన చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 30 మంది సాక్షుల సాక్ష్యాధారాలను కోర్టు విచారించి నేరం రుజువు కావడంతో నేరస్తుడు సయ్యద్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జి నిర్మలా గీతాంబ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రత్యేక ప్రాసిక్యూటర్ మోకాళ్ల సత్యనారాయణ, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ పక్షాన వాదించారు. లైజన్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుళ్లు దాడి శ్రీనివాస్, రఘు కోర్టులో ప్రవేశపెట్టారు.

భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలి

● మేడారం మినీజాతర ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సమీక్ష

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క, సాలరమ్మ మినీ జాతరలో భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వచ్చేనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ జాతర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, డీఎఫ్‌ఓ కిషన్ రాహుల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఏర్పాట్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మినీ జాతరతో పాటు 2026లో జరగనున్న మహాజాతర నాటికి శాశ్వత పనుల కోసం రూ.50 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. కొండాయి బ్రిడ్జి కోసం గతంలో రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశామని, ఇంజనీరింగ్ అధికారులు మరో రూ.16 కోట్ల అంచనా పెంచారని, త్వరలో నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన మళ్లీ జాతర పనులపై సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు.

శాఖల వారీగా సమీక్ష

ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, విద్యుత్, ఇరిగేషన్, వైద్య, పీఆర్ శాఖల అధికారుల ఏర్పాట్లపై ప్రధానంగా సమీక్షించారు. జాతరలో నాలుగు రోజుల పాటు జంపన్నవాగులో భక్తుల స్నానాల కోసం నీటి పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు అడగగా పడిగాపూర్ చెక్‌డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతరలో చేపట్టాల్సిన బందోబస్తు, భద్రత ఏర్పాట్లను మంత్రులకు జిల్లా ఎస్పీ శబరీష్ వివరించారు. తాగునీటి ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. సమావేశానికి ముందు మంత్రులు సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్.. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క, పక్కన మంత్రి సురేఖ, ఎంపీ, తదితరులు

కొండాయి బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభిస్తాం

● ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్

సాక్షి ఎఫెక్ట్..

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి - దొడ్ల మధ్యలో ఉన్న నూతన బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన సాక్షిలో వచ్చిన కొండాయి బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో? అనే కథనంపై అధికారులు స్పందించారు. వరదలకు గతంలో వేసిన బ్రిడ్జి కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. లోలెవల్‌లో కాకుండా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ చేయించడంతో ఆలస్యంగా అయిందని తెలిపారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి వర్షాకాలంలోపు పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. మేడారం జంపన్నవాగుపై నిర్మించిన నమూనా లాంటిదే ఇక్కడ కూడా నిర్మించాలని మంత్రి సీతక్క ఆదేశించారని గుర్తుచేశారు. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం.

69 ఏళ్ల చరిత్ర తెరమరుగు

వేల మందిని తీర్చిదిద్దిన చదువులమ్మ ఒడి తొలగింపు



కురవి హైస్కూల్ భవన సముదాయాన్ని కూల్చివేస్తున్న కూలీలు



కూల్చిన భవన శిథిలాలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న డ్రైవర్

కురవి: మండల కేంద్రంలో 69 ఏళ్ల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇక తెరమరుగు కానుంది. శిథిలమైన చదువులమ్మ ఒడి (బడి)ని తొలగించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఏళ్ల చరిత్ర కలిగి వేలాది మందిని ఉన్నతంగా తీర్చిదిద్దిన సరస్వతి నిలయంలో శుక్రవారం కూల్చివేత పనులు మొదలు పెట్టారు. 1956లో ఈ పాఠశాలను అగ్రికల్చర్ రిహాబిలిటేషన్ మంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించారు. ఇక్కడ చదివిన కొందరు విదేశాల్లో స్థిరపడగా, మరికొందరు మావోలుగా మారి అడవిబాట పట్టి అమరులయ్యారు. ఇంకొందరు మంచి హోదాలో ఉన్నారు. తమ బడి కూలిపోతోందని తెలిసిన పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.